ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించాలి

• కలెక్టర్ పమేలా సత్పతి

కలెక్టరేట్, జనవరి 8: ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులు ఎప్పటికప్పుడూ పరిష్కరిస్తూ, ప్రజల ఇబ్బందులు తొలగించాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో పాల్గొని ఫిర్యాదులు స్వీకరించారు. ఈసందర్భంగా మాట్లాడారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన 184 మంది నుంచి అర్జీలు స్వీకరించి, ఆయా శాఖల అధికారులకు అందజేశారు. ఆర్డీవో కార్యాలయానికి 19, నగర పాలక సంస్థకు 16, కరీంనగర్ రూరల్ తహసీల్దార్ కార్యాలయానికి 11 ఫిర్యాదులు రాగా, మిగతా శాఖలకు 138 ఫిర్యాదులు వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్, డీఆర్‌వో పవన్‌కుమార్, ఆర్డీవో కె.మహేశ్ పాల్గొన్నారు.

సురక్షిత బాల్యం కోసం కృషిచేయాలి

పిల్లలపై జరుగుతున్న హింసలను తగ్గిస్తూ, వారికి సరైన అవగాహనను కల్పిస్తూ సురక్షిత బాల్యాన్ని అందించడానికి అందరూ కృషి చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో జరిగిన స్నేహిత ఫస్ట్ వన్ కార్యక్రమంలో కలెక్టర్ పమేలా సత్పతి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వివిధ శాఖల అధికారులతో బృందాలను ఏర్పాటు చేసి 110 పాఠశాలల్లోని పిల్లల కొరకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. ఇబ్బంది ఉన్నప్పుడు ధైర్యంగా చైల్డ్ హెల్ప్ లైన్ 1098 ఉచిత నెంబరుకు ఫోన్ చేసే విధంగా ప్రోత్సహించాలన్నారు. సేఫ్ టచ్, అన్ సేఫ్ టచ్ తదితర వాటిపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ ధనలక్ష్మి, డీడబ్ల్యూవో సరస్వతి, డీఈవో జనార్దన్‌రావు, మార్కెటింగ్ అధికారి పద్మావతి, ప్రోగ్రాం అధికారి డేవిడ్ రాజు, జిల్లా వైద్యాధికారి లలితాదేవి, డీఆర్డీవో శ్రీలత, డీసీపీవో శాంత, సఖీ అధికారి లక్ష్మి పాల్గొన్నారు.

ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు పట్టం కట్టాలి

• కాంగ్రెస్ గ్యారెంటీలు అమలు చేయకుంటే ప్రజలు రోడ్లెక్కే రోజులు వస్తాయి
• మాజీ ఎంపీ బీ వినోద్‌కుమార్
• తాడికల్‌లో మండలస్థాయి కార్యకర్తల సమావేశం
• హాజరైన మాజీ ఎమ్మెల్యే రసమయి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీఆర్

శంకరపట్నం: తాడికల్ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్

శంకరపట్నం, జనవరి 8: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కే పట్టం కట్టాలని మాజీ ఎంపీ బీ వినోద్‌కుమార్ ప్రజలను కోరారు. సోమవారం తాడికల్ గ్రామంలో పార్టీ మండలస్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వినోద్ కుమార్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు అమలు చేయకుంటే ప్రజలు రోడ్లెక్కే రోజులు వస్తాయన్నారు. ఎంపీగా బండి సంజయ్ కేంద్రం నుంచి నయాపైసా తేలేదని విమర్శించారు. తమ ప్రభుత్వం పదేళ్ల పాలనలో 1.61 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసినట్లు వెల్లడించారు. రైతుబంధు నిధులు ఎక్కడికి పోయాయో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో యువతకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు స్పష్టం చేశారు. కేసీఆర్ సర్కారు పదేళ్లలో ఇరిగేషన్, విద్యుత్ ప్రాజెక్టుల కోసమే అప్పులు చేసిందని వివరించారు. ఐదేళ్లలో ఎంపీగా బండి సంజయ్ జిల్లాకు చేసిన సేవలు శూన్యమన్నారు. కొట్లాడి తెచ్చుకున్న రాష్ట్రాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపామన్నారు. తెలంగాణ గళం పార్లమెంట్‌లో వినిపించాలంటే బీఆర్ఎస్‌ను ప్రజలు గెలిపించాలని కోరారు. తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలకు వారం ముందు రైతుల ఖాతాల్లో రైతుబంధు డబ్బులు జమ చేసేందుకు నిధులు కేటాయిస్తే, వారికి నిలిపివేసి ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చామని సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారని, అసలు ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు వేశారా.. ఇంకెవరికైనా ప్రభుత్వం బిల్లులు చెల్లించిందో చెప్పాలని డిమాండ్ చేశారు. 2014 నుంచి 2019 వరకు తాను ఎంపీగా ఉన్న కాలంలో గోదావరి, కృష్ణ నదులపై నిర్మాణం చేస్తున్న ప్రాజెక్టులు, పవర్ ప్రాజెక్టులకు అనుమతులు సాధించుకున్నట్లు గుర్తు చేశారు. పదేళ్ల కాలంలో తొలి సీఎం కేసీఆర్ దేశంలోనే తెలంగాణను అగ్రగామిగా నిలిపినట్లు పేర్కొన్నారు. 60 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో ఎక్కడ చూసినా నెర్రెలు బారిన నేలలు కనిపించేవని తెలిపారు. కేసీఆర్ అధికారం చేపట్టాక మూడున్నరేళ్ల కాలంలోనే భారీ కాళేశ్వరం ప్రాజెక్టు కట్టి లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించామని గుర్తు చేశారు. తెలంగాణ ఏర్పాటయ్యాక విద్యుత్ రంగంలో గణనీయంగా 26 వేల మెగావాట్ల ఉత్పత్తిని సాధించినట్లు చెప్పారు. పదేళ్లలో 1.61 లక్షల ఉద్యోగాలు ఇచ్చినట్లు వెల్లడించారు. ప్రస్తుతం ఉద్యోగులకు జీతాలు ఇచ్చారో లేదో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం డిసెంబర్‌లోగా 2 లక్షల ఉద్యోగాలు ఇచ్చి తన హామీ నెరవేర్చుకోవాలని గుర్తు చేశారు. ఈసారి పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్ గడ్డపై గులాబీ జెండా ఎగురడం ఖాయమన్నారు. కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, జడ్పీటీసీ లింగంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మహిపాల్, సతీశ్ రెడ్డి, సంజీవరెడ్డి, పలు గ్రామాల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా మహా పడిపూజ

చొప్పదండి, జనవరి 8: మండల కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర మణికంఠ ఆలయ వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం రాత్రి మహా పడి పూజ మహోత్సవం నేత్రపర్వంగా సాగింది. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామికి ఫల పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించగా, కరీంనగర్ మాజీ పార్లమెంట్ సభ్యుడు బోయినపల్లి వినోద్ కుమార్, మాజీ ఎమ్మెల్యే సుంకె రవి శంకర్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

న్యాయవాదుల చెస్ పోటీలు ప్రారంభం

చెక్ పోటీలను ప్రారంభిస్తున్న జిల్లా జడ్జి ప్రతిమ

కోర్టుచౌరస్తా, జనవరి 8: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కోర్టు న్యాయవాదులకు, న్యాయమూర్తులకు కరీంనగర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహిస్తున్నారు. సోమవారం న్యాయవాది రఘురామన్ పర్యవేక్షణలో చెస్ పోటీలను నిర్వహించగా జిల్లా జడ్జి ప్రతిమ హాజరై లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం చెస్ పోటీల్లో న్యాయవాదులు పాల్గొన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు శ్రీవాణి నీరజ, లక్ష్మీ కుమారి, అరుణ, మెజిస్ట్రేట్లు, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి లింగంపల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

'అల్ఫోర్స్'కు ఎస్ఎస్ఐఎం-2024 చాంపియన్‌షిప్

కమాన్‌చౌరస్తా, జనవరి 8 : హైదరాబాద్‌లోని శివ శివాని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్టేట్ లెవెల్ మేనేజ్‌మెంట్ మీట్ 'సమన్వయ్ 2024'లో ఓవరాల్ చాంపియన్ షిప్‌ను జిల్లా కేంద్రంలోని అల్ఫోర్స్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థినులు గెలుచుకున్నారని కళాశాల కరస్పాండెంట్ రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈనెల 5, 6న వివిధ అంశాల్లో నిర్వహించిన పోటీల్లో అల్ఫోర్స్ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు అడ్వెంచర్స్, బిజినెస్ క్విజ్, ర్యాపిడ్ ఫైర్ తదితర అంశాల్లో ప్రతిభ చూపి, ఓవరాల్ చాంపియన్‌షిప్‌తోపాటు నగదు బహుమతి గెలుచుకొన్నారని చెప్పారు. విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఇక్కడ ప్రిన్సిపాల్ గోళి శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ విజయలక్ష్మి, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

శిక్షణ సర్టిఫికెట్ పొందిన మహిళలతో నాబార్డ్ ఏజీఎం

హుజూరాబాద్‌టౌన్, జనవరి 8: మహిళలు స్వయం ఉపాధి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని నాబార్డ్ ఏజీఎం జయప్రకాశ్ సూచించారు. హుజూరాబాద్‌లో నాబార్డ్ సహకారంతో స్పందన సేవా సొసైటీ ఆధ్వర్యంలో 30 మంది మహిళలు రోలింగ్ అండ్ పాలిషింగ్ డ్రై క్లీనింగ్ శిక్షణ పొందగా, సోమవారం వారికి సర్టిఫికెట్, స్టైఫండ్ చెక్కులను అందించారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యురాలు గౌతమి, కో ఆర్డినేటర్ సునీల్, ట్రైనర్ లతారెడ్డి, మాతృశ్రీ కాలేజీ యాజమాన్యం పాల్గొన్నది.

హాస్పిటల్‌ను తనిఖీ చేసిన డిప్యూటీ డీఎంహెచ్‌వో

హుజూరాబాద్ టౌన్, జనవరి 8: పట్టణంలోని జమ్మికుంటరోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్ఆర్ హాస్పిటల్‌ను హుజూరాబాద్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్పిటల్‌లో ల్యాబ్, వైద్య పరికరాలు, రికార్డులను పరిశీలించారు. నిర్వాహకుడు డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డిని, సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సీహెచ్‌వో సాజిద్, డివిజన్ హెల్త్ ఎడ్యుకేటర్ పంజాల ప్రతాప్ ఉన్నారు.

ఆర్టీసీ డిపో అభివృద్ధికి కృషి

హుజూరాబాద్‌టౌన్, జనవరి 8: ఉద్యోగులందరి సహకారంతో హుజూరాబాద్ ఆర్టీసీ డిపో అభివృద్ధికి కృషి చేస్తానని నూతన డిపో మేనేజర్ శ్రీకాంత్ పేర్కొన్నారు. సోమవారం బస్ డిపోలో ఆయనను ఉద్యోగులు కలిసి సన్మానించారు. డిపోలోని 64 బస్సుల ద్వారా నిత్యం 25వేల మంది ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేరవేస్తుండగా, రోజుకు రూ.12 లక్షల ఆదాయం వస్తున్నదని డీఎం వెల్లడించారు.

రీజియన్‌కు ఐదు నూతన బస్సులు

తెలంగాణచౌక్, జనవరి 8: ఇటీవల ఆర్టీసీ యాజమాన్యం కొనుగోలు చేసిన 80 నూతన బస్సుల్లో కరీంనగర్ రీజియన్‌కు ఐదు బస్సులను కేటాయించారు. రీజియన్ పరిధిలోని 11 డిపోలు ఉండగా అందులో కరీంనగర్ డిపో -1కు రెండు రాజధాని బస్సులు, జగిత్యాల డిపోకు రాజధాని బస్సు, హుస్నాబాద్ డిపోకు ఎక్స్‌ప్రెస్ బస్సు, మంథని డిపోకు ఒక ఎక్స్‌ప్రెస్ బస్సును కేటాయించారు. త్వరలో మరిన్ని నూతన బస్సులు రానున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.

మానేరులో ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు

కొత్తపల్లి, జనవరి 8: కరీంనగర్‌లోని మానేరు విద్యాసంస్థలలో సోమవారం నిర్వహించిన ముగ్గుల పోటీలు ఆహూతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి జ్యోతి ప్రజ్వల చేసి ముగ్గుల పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్ కడారి సునీతారెడ్డి ఉన్నారు.

ఉల్లాసంగా ఆత్మీయ సమ్మేళనం

గంగాధర, జనవరి 8: గంగాధర జడ్పీ పాఠశాలలో సోమవారం 2007-08 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఉల్లాసంగా సాగింది. ఈ సందర్భంగా చిన్న నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పూర్వ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి గురు భక్తిని చాటుకున్నారు.

ప్రణాళికా బద్ధంగా చదివితే ఉత్తమ ఫలితాలు

సైదాపూర్, జనవరి 8: విద్యార్థులు ప్రణాళికా బద్ధంగా చదివితే వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని తెలంగాణ సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హన్మాండ్ల భాస్కర్ తెలిపారు. సోమవారం ఆకునూరు ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఇంగ్లిష్ స్టడీ మెటీరియల్ ఉచితంగా పంపిణీ చేయగా, భాస్కర్‌ను ప్రధానోపాధ్యాయుడు రామస్వామి అభినందించారు.

ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు

గంగాధర, జనవరి 8 : మధురానగర్‌లోని ఫర్టిలైజర్ దుకాణాల్లో మండల వ్యవసాయాధికారి రాజు సోమవారం తనిఖీలు నిర్వహించారు. దుకాణాల్లోని బిల్లు బుక్‌లు, స్టాక్ రిజిస్టర్లు, గోదాముల్లోని ఎరువులను పరిశీలించారు. నాణ్యతా పరీక్షల కోసం ఎరువులు, పురుగు మందుల శాంపిల్స్‌ను హైదరాబాద్‌కు పంపించారు.

14 మందిపై మాల్ ప్రాక్టీస్ కేసు

కమాన్‌చౌరస్తా, జనవరి 8: శాతవాహన యూనివర్సిటీ పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ 1, 3వ సెమిస్టర్ పరీక్షల్లో సోమవారం 14 మందిపై మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ శ్రీరంగ ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

'వినోద్‌కుమార్‌కు క్షమాపణ చెప్పాలి'

హుజూరాబాద్‌టౌన్, జనవరి 8: మచ్చలేని నాయకుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌పై తప్పుడు ప్రచారం చేస్తున్న తీన్మార్ మల్లన్న తక్షణమే ఆయనకు క్షమాపణ చెప్పాలని ముదిరాజ్ మహాసభ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కొలిపాక సమ్మయ్యముదిరాజ్ డిమాండ్ చేశారు. సోమవారం హుజూరాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, యూట్యూబ్ చానల్‌లో తప్పుడు కథనాలు ప్రచారం చేయడం జర్నలిజాన్ని కించపరచడమేనన్నారు. ఒకప్పుడు యూట్యూబ్ చానల్‌లో దీనంగా విరాళాలు అడుక్కున్న మల్లన్నకు ఇప్పుడు రూ.వందల కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయో తెలంగాణ ప్రజలకు తెలుసన్నారు. సమయం వచ్చినప్పుడు ప్రజల నుంచి గుణపాఠం తప్పదని హెచ్చరించారు. వినోద్‌కుమార్‌పై తప్పుడు ప్రచారం చేసినందుకు బేషరతుగా ఆయనకు క్షమాపణ చెప్పాలని, లేదంటే ప్రజా ఆగ్రహానికి గురికాక తప్పదని సమ్మయ్యముదిరాజ్ హెచ్చరించారు.

మచ్చలేని నాయకుడు వినోద్‌కుమార్

గంగాధర, జనవరి 8 : రాజకీయాల్లో మచ్చలేని మంచి నాయకుడిగా మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్‌కు పేరు ఉందని, అలాంటి వ్యక్తిపై కొందరు తప్పుడు ప్రచారం చేస్తు పబ్బం గడుపుకోవాలని చూడడం హేయనీయమని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాగి మహిపాల్‌రావు సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. అర్హతలేకున్నా వినోద్‌కుమార్ బంధువుకు జెన్‌కోలో ఉద్యోగం ఇచ్చారని ఓ యూట్యూబ్ చానల్‌లో తప్పుడు ప్రచారం చేశారని దుయ్యబట్టారు. తప్పుడు కథనాలు అల్లుతూ వినోద్‌కుమార్‌ను బద్నాం చేయాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఆయన గెలుపును ఎవరూ ఆపలేరని స్పష్టం చేశారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED
Rizee is hiring Sales Executives Female and Male to work in Warangal, Karimnagar and mahabubnagar. Qualification: GRADUATION OR POST GRADUATION, Experience 0-1 year, Basic pay plus, travel expenses and incentives based on Sales done. Please share your resume to hr@rizee.inRizee contact no:
7075448813

CHANGE OF NAME
I, SUNKE CHANDRAIAH, S/o. RAJAIAH, R/o. 2-84, Chinnapur, Buggaram, Jagityal, TS, Have changed my name As SUNKE CHANDU, S/o. RAJAIAH
NT-319321

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

కుల నిర్మూలన కోసం పోరాడాలి

తెలంగాణచౌక్, జనవరి 8: దేశంలో కుల నిర్మూలన కోసం పోరాటాలు కొనసాగించాలని ఇండియా సంయుక్త రాష్ట్రాల కమ్యూనిస్టు పార్టీ(సీపీయూఎస్ఐ) రాష్ట్ర అధికారి ప్రతినిధి చామకూరి నర్సయ్య పిలుపునిచ్చారు. నగరంలోని ప్రెస్ భవనంలో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. కుల నిర్మూలన కోసం చేసిన పోరాటంలో అమరులైన వీరులకు రెండు నిమిషాలు మౌనం పాటించారు. సమావేశంలో రాజన్న, కృష్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైన్ షాపును ఎత్తివేయాలి

తెలంగాణచౌక్, జనవరి 8: నగరంలోని గాంధీ రోడ్డు గల వైన్ షాపును ఎత్తి వేయాలని సీపీఎం నగర కార్యదర్శి గుడికందుల సత్యం ఆధ్వర్యంలో నగర కమిటీ సభ్యులు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ పమేలాసత్పతికి వినతిపత్రం అందజేశారు. నిత్య రద్దీగా ఉండే ప్రాంతంలో వైన్ షాపు అనుమతి ఇవ్వడంపై ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. వెంటనే వైన్‌షాపును మరో చోటుకు తరలించాలని కోరారు. ఇక్కడ నాయకులు మల్లయ్య, సాగర్ ఉన్నారు.

బకాయిల విషయంలో నిర్లక్ష్యం వద్దు

హుజూరాబాద్ టౌన్, జనవరి 8: విద్యుత్ శాఖలో పేరుకుపోయిన విద్యుత్ బకాయిలను వసూలు చేయడంలో సిబ్బంది నిర్లక్ష్యం చూపవద్దని కరీంనగర్ ట్రాన్స్‌కో ఎస్ఈ గంగాధర్ అన్నారు. సోమవారం హుజూరాబాద్ పట్టణంలోని మధువని గార్డెన్స్‌లో విద్యుత్ శాఖ అధికారులు, ఉద్యోగులతో డివిజన్ స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. విద్యుత్ అక్రమ వినియోగాన్ని అరికట్టాలని సూచించారు. సమావేశంలో ట్రాన్స్‌కో డీఈ లక్ష్మారెడ్డి, ఏడీఈ శ్రీనివాస్, డివిజన్‌లోని ఏఈలు, సబ్ డివిజనల్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మానకొండూర్ రూరల్, జనవరి 8: గంగిపల్లికి చెందిన మానకొండూర్ సొసైటీ ఉపాధ్యక్షుడు పంజాల శ్రీనివాస్‌గౌడ్ తల్లి ఇటీవల మృతి చెందింది. కాగా సోమవారం కుటుంబసభ్యులను గౌడ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లగొండ తిరుపతి గౌడ్, తిమ్మాపూర్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ పరామర్శించారు.

వాగేశ్వరి కళాశాలలో వర్క్‌షాప్

తిమ్మాపూర్ రూరల్, జనవరి 8: రామకృష్ణకాలనీలోని వాగేశ్వరి ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం టాస్క్ ఆధ్వర్యంలో 'ప్రోగ్రామింగ్ ఎసెన్షియల్ ఇన్ పైతాన్' అంశంపై మూడు రోజుల వర్క్‌షాప్‌ను కళాశాల చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. ఐటీ రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు.

అయోధ్య రాముడి అక్షింతల వితరణ

మానకొండూర్ రూరల్/చిగురుమామిడి జనవరి 8: అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ నుంచి వచ్చిన పూజిత అక్షింతల వితరణ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నది. ఇందులో భాగంగా సోమవారం మానకొండూర్ మండలంలోని ముంజంపల్లి, ఖాదరగూడెం, దేవంపల్లి, చెంజర్ల, కొండపల్కల, చిగురుమామిడి మండలంలోని పలు గ్రామాల్లో ట్రస్టు సభ్యులు ఇంటింటికీ వెళ్లి భక్తులకు అక్షింతలను అందజేశారు.

యూనిటీ కప్ 2024 పోస్టర్ ఆవిష్కరణ

కొత్తపల్లి, జనవరి 8: కరీంనగర్ క్రికెట్ క్లబ్, సూఫ క్రికెట్ అకాడమీ ఆధ్వర్యంలో యూనిటీ కప్ 2024 సీజన్ 1 క్రికెట్ టోర్నమెంట్‌కు సంబంధించిన వాల్ పోస్టర్‌ను సోమవారం కరీంనగర్ ఏసీపీ నరేందర్, ఒలింపిక్ సంఘం జిల్లా అధ్యక్షుడు నందెల్లి మహిపాల్‌తో కలిసి ఆవిష్కరించారు. కరీంనగర్ క్రికెట్ క్లబ్ అధ్యక్షుడు యాదగిరి మాట్లాడుతూ ఈనెల 10 నుంచి సీజన్ వన్ మెగా ఈవెంట్‌ను భారీ ఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రథమ బహుమతి రూ.71000, ద్వితీయ బహుమతి రూ.31,000ను అందించనున్నట్లు తెలిపారు. ఎంట్రీ ఫీజు రూ.5వేలు చెల్లించి పేరును నమోదు చేసుకోవాలన్నారు.

తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

• మాజీ మేయర్ రవీందర్‌సింగ్

కార్పొరేషన్, జనవరి 8: నగరంలోని వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ చౌరస్తాలో సుందరీకరణలో భాగంగా తొలిగించిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని వెంటనే ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని మాజీ మేయర్ రవీందర్‌సింగ్ డిమాండ్ చేశారు. సోమవారం ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కార్మికులందరు కలిసి ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశామన్నారు. కేసీఆర్ తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేశాకే ఏ కార్యక్రమాన్ని అయినా చేపడుతారని పేర్కొన్నారు. 2022 ఆగస్టు 8న తెలంగాణ చౌక్, తెలంగాణ తల్లి చౌరస్తాల సుందరీకరణకు ఒకే సారి టెండర్లు జరిగాయని పేర్కొన్నారు. తెలంగాణ చౌక్‌లో పనులు పూర్తి చేసిన వారు తెలంగాణ తల్లి చౌరస్తాలో పనులు ఎందుకు పూర్తి చేయలేదన్నారు. నగరపాలక సంస్థలోని ఆంధ్రా అధికారులు ఈ పనుల విషయంలో నిర్లక్ష్యం చూపుతున్నారన్నారు. తొలిగించిన విగ్రహాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని లేకపోతే ఉద్యమకారులందరం ఏర్పాటు చేసుకుంటామని తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న రవీందర్‌సింగ్

'ప్రజాపాలన' డాటా ఎంట్రీ త్వరగా పూర్తి చేయాలి

జమ్మికుంట, జనవరి8: ప్రజాపాలన కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తుల డాటా ఎంట్రీ త్వరగా పూర్తి చేయాలని హుజూరాబాద్ ఆర్డీవో రాజు ఆదేశించారు. సోమవారం ఆయన జమ్మికుంట మున్సిపల్ కార్యాలయంలో డాటా ఎంట్రీ ప్రక్రియను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. మున్సిపల్ పరిధిలో 30 వార్డులుండగా, ప్రజా పాలనలో 11,616 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. వచ్చిన ప్రతి దరఖాస్తును ఈ నెల 17లోగా డాటా ఎంట్రీ చేయాల్సిందేనని స్పష్టం చేశారు. దరఖాస్తుదారుల ఆధార్, రేషన్, కుటుంబ సభ్యుల వివరాలన్నీ తప్పుల్లేకుండా ఆన్‌లైన్‌లో పొందుపరచాలని సూచించారు. సిబ్బంది పనితీరును ఎప్పటికప్పుడూ పర్యవేక్షించాలని మున్సిపల్ కమిషనర్‌కు చెప్పారు. ఇక్కడ కమిషనర్ శ్రీనివాస్‌తో పాటు మేనేజర్ భూపాల్‌రెడ్డి, ఆర్ఐ వాణి, అధికారులు, సిబ్బంది, తదితరులున్నారు.

వేగంగా దరఖాస్తుల ఆన్‌లైన్

చిగురుమామిడి, జనవరి 8: ప్రజాపాలన దరఖాస్తుల డాటా ఎంట్రీ ప్రక్రియ వేగంగా సాగుతున్నదని మండల నోడల్ అధికారులు తహసీల్దార్ నరేందర్, ఎంపీడీవో నర్సయ్య తెలిపారు. సోమవారం మండల పరిషత్, ఎమ్మార్సీ, రెవెన్యూ కార్యాలయాల్లో కొనసాగుతున్న దరఖాస్తుల డాటా ఎంట్రీ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మండలంలో 17 గ్రామాలు ఉండగా, 14,0 46 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.

జిల్లాలో రెండు కరోనా పాజిటివ్ కేసులు

విద్యానగర్, జనవరి 8: జిల్లాలో సోమవారం రెండు కరోనా కేసులు నమోదయ్యాయి. అనుమానితుల నుంచి శాంపిల్స్ సేకరించిన వైద్యసిబ్బంది ఆర్టీపీసీఆర్ నిర్ధారణ పరీక్షలు చేయగా ఇద్దరికి పాజిటివ్ వచ్చింది. ఇందులో ఒకరు మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో డెలివరీ కోసం వచ్చిన మహిళ కాగా, మరొకరు జనరల్ దవాఖానలో చికిత్స కోసం వచ్చిన మహిళ ఉన్నారు. వీరికి కరోనా చికిత్స అందిస్తున్నట్లు వైద్యులు తెలిపారు.

కౌన్సిలర్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు

జమ్మికుంట, జనవరి 8: మున్సిపల్ పరిధిలోని హౌసింగ్‌బోర్డుకాలనీకి సంబంధించిన జిమ్ పక్కన గల ప్రభుత్వ భూమిని 6వ వార్డు కౌన్సిలర్ శ్రీపతి నరేశ్‌గౌడ్ ఆక్రమించుకుని ఎలాంటి అనుమతుల్లేకుండా నిర్మాణం చేపడుతున్నారంటూ.. అదే కాలనీకి చెందిన మాజీ వార్డు సభ్యుడు తూడి రవిచందర్ రెడ్డి సోమవారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతికి ఫిర్యాదు చేశారు. అధికారులు చర్యలు తీసుకోకుంటే ఈ నెల 11న గాంధీ చౌక్ వద్ద ఆమరణ నిరాహారదీక్ష చేస్తానని అందులో పేర్కొన్నారు.

వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం సిబ్బంది

ఎల్ఎండీ ఎస్సారెస్పీ ఆఫీసులో చోరీ

• 5 మానిటర్లు, 4 సీపీయూలు, 2 ప్రింటర్లు మాయం

తిమ్మాపూర్, జనవరి 8: తిమ్మాపూర్ మండలంలోని ఎల్ఎండీ ఎస్సారెస్పీ ఇరిగేషన్ ఐదో డివిజన్ రెండో సర్కిల్ ఆఫీసులో ఆదివారం సాయంత్రం చోరీ ఘటన కలకలం రేపింది. వాచ్‌మెన్ బయటకు వెళ్లి తిరిగివచ్చిన కొన్ని గంటల్లోనే ఐదు కంప్యూటర్ మానిటర్లు, నాలుగు సీపీయూలు, రెండు ప్రింటర్లను ఎత్తుకెళ్లడం చర్చనీయాంశమైంది. కరీంనగర్ ఏసీపీ కరుణాకర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. వాచ్‌మెన్ కనుకయ్య ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కాపాలగా ఉన్నాడు. మధ్యాహ్నం వేళ బయటకు వెళ్లి సాయంత్రం 6 గంటలకు తిరిగివచ్చేసరికి ఆఫీసు తలుపులు తెరిచి ఉన్నాయి. వెంటనే ఆయన ఫోన్‌లో అధికారులకు తెలియజేశారు. వారు పోలీసులకు సమాచారం అందించగా.. సీఐ స్వామి, ఎస్ఐ చేరాలు క్లూస్ టీంతో కలిసి అక్కడికి చేరుకొని ప్రాథమిక విచారణ జరిపారు. ఈ ఘటనపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని ఏసీపీ చెప్పారు.

సైబర్ నేరగాళ్ల కొత్త గాలం

• శుభకార్యాల పేరిట ఫంక్షన్‌హాల్ నిర్వాహకులకు వల
• వేములవాడలో ఇద్దరికి కుచ్చుటోపి..

వేములవాడ, జనవరి 8 : సైబర్ నేరగాళ్లు కొత్త మోసాలకు పాల్పడుతున్నారు. పెరిగిన సాంకేతికత ఆధారంగా, అమాయక ప్రజల అవసరాలు ఆసరాగా చేసుకొని రెచ్చిపోతున్నారు. రోజుకో తీరున కొత్త ఎత్తులతో బోల్తా కొట్టిస్తూ డబ్బులు కాజేస్తున్నారు. తాజాగా వేములవాడలో శుభకార్యాల పేరిట ఫంక్షన్ హాల్ నిర్వాహకులతో ఫోన్‌లో పరిచయాలు పెంచుకొని పలువురికి కుచ్చుటోపి పెట్టారు. బాధితుల కథనం ప్రకారం.. వేములవాడ పట్టణంలోని బైపాస్ రోడ్‌లో ఫంక్షన్ హాల్ నిర్వాహకుడికి ఓ సైబర్ నేరగాడు లోకల్ నంబర్‌తో కాల్ చేశాడు. మాది ఇక్కడేనని, పలానా కాలనీ పేరు చెప్పాడు. మా ఇంట్లో శుభకార్యం ఉందని ఫంక్షన్ హాల్ కావాలని సమయం కోరాడు. మీ సర్వీస్ బాగుంటుందని మాటలు కలిపి, బుట్టలో వేసుకున్నాడు. మీకు తెలిసిన మంచి ఫొటోగ్రాఫర్, డెకరేషన్ చేసే వ్యక్తుల సెల్ నంబర్లు ఇవ్వాలని అడిగి తీసుకున్నాడు. ఆ తర్వాత వారికి ఫోన్ చేసి పలానా ఫంక్షన్ హాల్ బుక్ చేశానని, నిర్వాహకుడితో మాట్లాడితే డెకరేషన్, ఫొటోలు మీరు బాగా తీస్తారని చెప్పాడని అంటాడు. మీరు ఎక్కడ ఉన్నారో చెబితే టైం చూసుకొని వచ్చి అడ్వాన్స్ ఇస్తానని నమ్మించాడు. తర్వాత ఓ రెండు గంటల తర్వాత సదరు వ్యక్తులకు ఫోన్ చేసి నేను మీ దగ్గరికే వస్తున్నానని, అయితే అత్యవసరంగా ఒకరికి డబ్బులు పంపించాల్సి ఉందని అన్నాడు. నా ఫోన్‌లో గూగుల్ పే, ఫోన్‌పే పనిచేయడం లేదని, నా దగ్గర పూర్తి నగదు ఉందని చెబుతాడు. మీ దగ్గరికి రాగానే పూర్తి డబ్బులు ఇస్తాను అని నమ్మబలికి ఒకరి వద్ద రూ.1200,మరొకరి వద్ద రూ. 1400,ఫోన్ పే ద్వారా ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాడు. అనంతరం ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో మోసపోయామని గుర్తించి మరుసటి రోజు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే రూ.2500నగదు దాటిన వాటిని మాత్రమే సైబర్ క్రైమ్ పోలీసులు పరిగణలో తీసుకునే అవకాశం ఉండగా, బాధితులు చేసేదేం లేక వెనుదిరిగారు. ఇదిలా ఉండగానే సోమవారం మరోసారి కేటుగాడు రెచ్చిపోయి శాత్రాజుపల్లి రహదారిలోని మరో ఫంక్షన్ హాల్ నిర్వాహకుడికి ఫోన్ చేసి ఇదే తరహాలో మోసానికి పాల్పడేందుకు ప్రయత్నించాడు. అయితే అప్పటికే సంతోష్ ఫొటో స్టూడియో నిర్వాహకుడు మ్యాన సంతోష్ ద్వారా విషయాన్ని తెలుసుకున్న సదరు ఫంక్షన్ హాల్ నిర్వాహకుడు అప్రమత్తం కాగా, ఈ వ్యవహారం చర్చనీయాంశంగా మారింది.